వేడుకగా కానుం పొంగల్

- కిక్కిరిసిన సముద్రతీరాలు, పర్యాటక ప్రాంతాలు
- జనసంద్రంగా మారిన మెరీనా
- పళవేర్కాడు, మహాబలిపురంలో సందర్శకుల సందడి

చెన్నై, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా బుధవారం కానుం పొంగల్ సందర్భంగా సముద్రతీరాలు, ప్రముఖ పర్యాటక ప్రాంతాలు, జలపాతాలకు పిల్లా పాపలతో ప్రజలు పోటెత్తారు. భోగి, సంక్రాంతి, కనుమ పండుగ అంటూ మూడు రోజులపాటు ఇంటిపట్టునే గడిపిన నగరవాసులంతా కట్టలు తెంచుకున్న నదీ జలాల్లా బుధవారం సాయంత్రం పర్యాటక ప్రాంతాలకు తరలివెళ్లారు. చల్లటి గాలులతో సేద తీర్చే మెరీనా బీచ్ మధ్యాహ్నం నుంచే జనంతో నిండిపోయింది. లైట్‌హౌస్ నుంచి అన్నాదురై సమాధి వరకు ఎటుచూసిన జనంతో కిటకిటలాడింది. గాంధీ విగ్రహ కూడలి ప్రాంతం, కార్మికుల విగ్రహ ప్రాంతం, అన్నాదురై, ఎంజీఆర్ సమాధి ప్రాంతాలూ జనసంచారంతో కళకళలాడాయి. ఎండవేడిమిని కూడా పట్టించుకోకుండా మెరీనాబీచ్‌కు ఉదయం 11 గంటల నుంచే నగరవాసులు కుటుంబ సమేతంగా బయలుదేరారు. ఇసుక తిన్నెలపై, సర్వీసు రోడ్డులోని సిమెంట్ బల్లలు, గొడుగుల దిగువ కూర్చుని వేడివేడి బజ్జీలు, జంతికలు, మరమరాలు తింటూ గడిపారు. బీచ్ అంతటా బజ్జీల దుకాణాలు, సుండల్ దుకాణాల వద్ద రద్దీ అధికమైంది. అక్కడక్కడా చిన్న సైజు రంగుల రాట్నమెక్కి చిన్నారులు కేరింతలు కొట్టారు. సబర్బన్ ప్రాంతాలు, తిరువళ్లూరు, చెంగల్పట్టు, కాంచీపురం సహా సమీప జిల్లాలకు చెందిన ప్రజలు కూడా మెరీనా బీచ్, ఐలాండ్ గ్రౌండ్స్, వండలూరు జూ, ఎగ్మూరు మ్యూజియం, లజ్ మైలాపూరు పార్కు, టి.నగర్ నటేశన్ పార్కు, జీవా పార్కులకు వెళ్ళి తినుబండారాలు తింటూ కబుర్లాడుకుంటూ సందడి చేశారు. మెరీనాతీరంలో విపరీతమైన రద్దీ ఏర్పడటంతో పోలీసులు నేరస్థుల కదలికలపై తీవ్ర నిఘా వేశారు. వాచ్‌టవర్ల నుంచి బైనాక్యులర్ల ద్వారా పరిశీలించారు.



టాప్‌లేని రంగులరాట్నంలో చిన్నారులు

ఈసీఆర్‌లో...

ఇక ఈస్ట్‌కోస్ట్ రోడ్డులోని ఉద్యానవనాలు, ముట్టుకాడు బోట్ హౌస్, వడ నెమ్మేలి మొసళ్ల పార్కు, తిరువిడంధై తీరం తదితర ప్రాంతాల వద్ద కూడా వేలాదిమంది ప్రజలు పిల్లాపాపలతో గడిపారు. వండలూరు జంతు ప్రదర్శనశాలలో విపరీతమైన రద్దీ కనిపించింది. సుమారు 34 వేల మంది జంతు ప్రదర్శన శాలను సందర్శించారని అధికారులు తెలిపారు. ఇక బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ సుమారు పది వేలమందికి పైగా సందర్శకులు విచ్చేశారని తెలిపారు. కుటుంబ సమేతంగా వెళ్ళి నగరవాసులు ఆ జంతు ప్రదర్శనశాల అంతటా తిరుగుతూ పులులు, సింహాలు, జింకలు, ఏనుగులు, చింపాంజీలు, గుర్రాలను తిలకించారు.



బారికేడ్ల వద్ద నిలిచి తీరాన్ని తిలకిస్తున్న నగరవాసులు - చిన్నారుల చేతికి టాగ్‌లు



మెరీనా తీరంలో నగరవాసులు

మహాబలిపురంలో...

ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన చారిత్రక పర్యాటక ప్రాంతం మహాబలిపురంలో సందర్శకుల సంఖ్య విపరీతంగా పెరిగింది. ఉదయం నుంచే అక్కడి అర్జున తపస్సు ప్రాంతం, వెన్నముద్ద బండరాయి, పాండవులు పంచరథాల ప్రాంతం వద్ద పర్యాటకులు, కుటుంబ సమేతంగా వెళ్లిన నగరవాసులు వేలసంఖ్యలో పర్యటించి చారిత్రక శిల్ప సౌందర్యాలను తిలకించారు. కానుం పొంగల్‌ను పురస్కరించుకుని రాష్ట్ర రవాణా సంస్థ, మహానగర రవాణా సంస్థ ప్రత్యేక బస్సులు నడిపాయి. మహాబలిపురంలోని చారిత్రక ప్రదేశాల వద్ద సుమారు రెండు వందల మంది పోలీసులు భద్రతా విధులు నిర్వర్తించారు.

పళవేర్కాడులో...

పళవేర్కాడు సరస్సు ప్రాంతంలోను కానుం పొంగల్ సందర్భంగా పర్యాటకుల సందడి అధికమైంది. అక్కడి డచ్ సిమెట్రీ, నీడ గడియార ప్రాంతం, ఆదినారాయణ పెరుమాళ్ ఆలయం, ప్రాచీన మసీదు, పక్షుల శరణాలయం తదితర ప్రాంతాలను సందర్శించేందుకు వేలాదిమంది పర్యాటకులు తరలివెళ్లారు. కుటుంబ సభ్యులతో వెళ్ళిన వీరంతా తినుబండారాలను తింటూ ప్రకృతి సౌందర్యాలను ఆస్వాదిస్తూ గడిపారు.



బీచ్‌లో ఇనుపతాడుపై ఓ బాలిక విన్యాసం



తుపాకీతో బెలూన్లను కాల్చుతున్న యువతి



ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో గుమికూడిన నగరవాసులు

మునియాండి ఆలయంలో సహపంక్తి విందు

- 100 గొర్రెలు, 50 కోళ్ల బలి
- 5,000 మందికి మాంసాహారం

ప్యారీస్, జనవరి 17: మదురై జిల్లా తిరుమంగళం సమీపంలోని గోపాలపురంలో ప్రసిద్ధిచెందిన మునియాండి స్వామి ఆలయంలో పొంగల్ పండుగ సందర్భంగా నాలుగు రోజుల ఉత్సవాలు కోలాహలంగా జరిగాయి. కనుమ రోజైన మంగళవారం ఆలయ ప్రాంగణంలో మహిళలు పొంగళ్లు పొంగించి స్వామివారికి నివేదించారు. అలాగే, పలు గ్రామాలకు చెందిన భక్తులు స్వామివారి మొక్కు చెల్లించేలా 100 గొర్రెలు, 50 కోళ్లు బలిచ్చారు. 250 మందికి పైగా మహిళలు పాల కలశాలతో ఊరేగింపుగా వెళ్లి మునియాండికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం భక్తులు బలిచ్చిన గొర్రెలు, కోళ్ల మాంసం, 60 బస్తాల బియ్యంతో బిర్యానీ వండి భక్తులకు సహపంక్తి ఏర్పాటు చేశారు.



సామూహిక విందులో పాల్గొన్న భక్తులు

రేపు చెన్నైకి మోదీ

'ఖేలో ఇండియా' ప్రారంభోత్సవానికి హాజరు

- ఆ తరువాత శ్రీరంగం, రామేశ్వరం ఆలయాల సందర్శన
- 3 రోజుల ప్రధానమంత్రి పర్యటన ఖరారు



చెన్నై, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఈ నెల 19న చెన్నైకి రానున్నారు. అదేవిధంగా మూడు రోజులపాటు రాష్ట్రంలో పర్యటించనున్నారు. అయోధ్య రామాలయంలో ప్రాణప్రతిష్ఠ జరుగనున్న నేపథ్యంలో ఆయన దేశవ్యాప్తంగా సుప్రసిద్ధ ఆలయాలకు వెళ్లి ఆయా ప్రాంతాల్లోని నదులు, తీర్థాల నుంచి పవిత్ర జలాలను సేకరిస్తున్నారు. ఇందులో భాగంగా ఈనెల 19వ తేదీ సాయంత్రం 4.50 గంటలకు మోదీ బెంగళూరు నుంచి ప్రత్యేక విమానంలో చెన్నైకి విచ్చేస్తున్నారు. విమానాశ్రయం వద్ద గవర్నర్ ఆర్ఎన్ రవి, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, మంత్రులు, బీజేపీ రాష్ట్ర నాయకులు ఆయనకు ఘనస్వాగతం పలకనున్నారు. ఆ తర్వాత విమానాశ్రయం నుంచి హెలికాప్టర్‌లో మెరీనా బీచ్ నేపియర్ బ్రిడ్జి సమీపంలోని అడయార్ ఐఎన్ఎస్ హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి కారులో నెహ్రూ స్టేడియానికి చేరుకుంటారు. ఆ స్టేడియంలో 'ఖేలో ఇండియా' పోటీలను ఆయన ప్రారంభించనున్నారు. చెన్నై, మదురై, తిరుచ్చి, కోయంబత్తూరు నగరాల్లో ఈ పోటీలు ఈనెల 19 నుంచి 31వ తేదీ వరకు జరగనున్న విషయం తెలిసిందే. ఈ పోటీల్లో 18 యేళ్లలోపు క్రీడాకారులు ఆరువేల మందికిపైగా పాల్గొంటున్నారు. ఈ క్రీడల ప్రారంభోత్సవాల్లో ప్రధానితోపాటు గవర్నర్ రవి, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, కేంద్ర క్రీడాశాఖ మంత్రి అనురాగ్‌సింగ్ ఠాకూర్, రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి ఉదయనిధి తదితరులు పాల్గొంటారు. సాయంత్రం 7.30 గంటలకు ఈ వేడుకలు పూర్తయ్యాక ప్రధాని మోదీ కారులో గిండిలోని రాజ్‌భవన్‌కు చేరుకుంటారు. రాజ్‌భవన్‌లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై, పార్టీ సీనియర్ నేతలతో ఆయన భేటీ అవుతారు.

20న శ్రీరంగంలో పర్యటన...

ఈనెల 19వ తేది రాత్రి ప్రధాని మోదీ రాజ్‌భవన్‌లోనే బసచేస్తారు. మరుసటి రోజు శ్రీరంగానికి బయలుదేరి వెళతారు. రాజ్‌భవన్ నుంచి కారులో ఉదయం 9.25 గంటలకు మీనంబాక్కం విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి విమానంలో తిరుచ్చికి చేరుకుంటారు. తిరుచ్చి నుంచి కారులో శ్రీరంగం ఆలయానికి చేరుకుంటారు. ఆలయంలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొంటారు. ఆ ఆలయ పరిసరాల్లో 'స్వచ్ఛ్ తీర్థ్' పేరుతో పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా ఆలయ పరిసరాలను శుభ్రం చేయనున్నారు. శ్రీరంగం ఆలయంలో ఆయన ఉదయం 11 నుంచి 12.40 గంటలవరకు ఉంటారు. ఆ తర్వాత అక్కడి నుండి హెలికాప్టర్‌లో బయలుదేరి మధ్యాహ్నం 2.10 గంటలకు రామేశ్వరానికి బయలుదేరి వెళతారు. రామేశ్వరం రామనాథస్వామి వారి ఆలయానికి వెళ్ళి ప్రత్యేక పూజల్లో పాల్గొంటారు. ఆ తర్వాత ఆలయ పరిసరాలను శుభ్రం చేయనున్నారు. ఆ రోజు రాత్రి రామేశ్వరంలోని శ్రీరామకృష్ణ మఠంలో బస చేయనున్నారు. ఈ నెల 21 ఉదయం రామేశ్వరం అగ్నితీర్థం కడలిలో స్నానమాచరిస్తారు. మళ్లీ రామనాథస్వామిలో సేవలో పాల్గొంటారు. అక్కడ ప్రత్యేక పూజాది కార్యక్రమాల్లో పాల్గొంటారు. తరువాత కారులో అరిచల్ మునై ప్రాంతానికి వెళతారు. ఉదయం 10.25 గంటలకు అక్కడి కోదండ రామాలయాన్ని సందర్శిస్తారు. ఆ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఉదయం 11.25 గంటల వరకు ఆలయంలోనే గడుపుతారు. అటు పిమ్మట అయోధ్య రామాలయం కోసం సముద్రంలో తీర్థ జలాలను సేకరించనున్నారు. ఇలా ఆలయాలలో సేకరించిన పవిత్ర జలాల కలశాలతో ఆయన హెలికాప్టర్‌లో మదురై విమానాశ్రయం చేరుకుంటారు. అక్కడి నుంచి విమానంలో ఢిల్లీకి బయలుదేరి వెళతారు. ప్రధాని మోదీ పర్యటన సందర్భంగా చెన్నై, తిరుచ్చి, శ్రీరంగం, రామేశ్వరం తదితర ప్రాంతాల్లో భారీ భద్రతా ఏర్పాట్లు చేపడుతున్నారు.

స్టార్టప్‌లో రాష్ట్రం ముందంజ

- సీఎం స్టాలిన్



అధికారులకు పురస్కారం అందిస్తున్న కేంద్రమంత్రి పీయూష్ గోయల్

ప్యారీస్, జనవరి 17: స్టార్టప్ ఆవిష్కరణలో రాష్ట్ర అగ్రస్థానంలో ఉందని ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రకటించారు. స్టార్టప్ ర్యాంకుల జాబితాలో రాష్ట్రం 2022వ సంవత్సరంలో ప్రథమస్థానంలో నిలిచింది. టాన్సిట్ పరిశ్రమల ఆధార నిధులు, ఎస్సీ, ఎస్టీ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, లంచ్ పాడ్ రంగంలో తమిళనాడు అగ్రస్థానంలో నిలిచింది. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి స్టాలిన్ బుధవారం తన ట్విట్టర్ ఖాతా వేదికగా ప్రశంసల జల్లు కురిపించారు. పరిశ్రమల అభివృద్ధిలో రాష్ట్రం రోజురోజుకు ముందుకు సాగి వెళుతోందని, రాష్ట్రంలో ప్రస్తుతం 7,600కు పైగా స్టార్టప్ సంస్థలు ఉన్నాయని, వాటి ద్వారా ఒక్క 2022వ సంవత్సరంలో మాత్రమే రికార్డు స్థాయిలో ఆవిష్కరణలు నిర్వహించినట్లు తెలిపారు. 2,250 సంస్థలు ఈ రంగంలో మంచి గుర్తింపు పొందాయని, ఈ రికార్డు కోసం రాష్ట్ర మంత్రి టీఎం అన్బరసన్, అధికారులు చేసిన కృషి అభినందనీయమని, ఈ స్థానాన్ని రాబోయే రోజుల్లో కూడా నిలబెట్టుకునేలా అధికారులు కృషిచేయాలంటూ సీఎం స్టాలిన్ ఎక్స్ వేదికగా తెలియజేశారు. కాగా, స్టార్టప్ సంస్థల ఏర్పాటులో అగ్రస్థానం దక్కించుకున్న రాష్ట్రానికి కేంద్రమంత్రి పీయూష్ గోయల్ అవార్డు ప్రదానం చేశారు. మంగళవారం ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర పరిశ్రమల శాఖ అధికారులు కేంద్రమంత్రి నుంచి ఈ పురస్కారం అందుకున్నారు.

ఘనంగా ఎంజీఆర్ జయంతి

వాడవాడలా నివాళి • పార్టీ కార్యాలయంలో 107 కిలోల కేక్ కట్ చేసిన ఈపీఎస్

ప్యారీస్, జనవరి 17: అన్నాడీఎంకే వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ ఎంజీఆర్ 107వ జయంతి వేడుకలు ఆ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. అన్నాడీఎంకే శ్రేణులు వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహించారు. చెన్నైలోని రాయపేట పార్టీ ప్రధాన కార్యాలయం ఎంజీఆర్ మాళిగై వద్ద జయంతి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. పార్టీ కార్యాలయ ప్రాంగణంలో దివంగత మాజీ ముఖ్యమంత్రులు ఎంజీఆర్, జయలలిత విగ్రహాలకు ప్రతిపక్ష నేత, పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం ఎంజీఆర్ 107వ జయంతిని తలపించే రీతిలో ప్రత్యేకంగా తయారు చేయించిన 107 కిలోల భారీ కేక్‌ను ఎడప్పాడి కట్ చేసి పార్టీ ప్రముఖులకు పంచిపెట్టారు. పార్టీ ప్రిసీడియం చైర్మన్ తమిళ్‌మగన్ హుస్సేన్, మాజీ మంత్రులు పొన్నయ్యన్, డి.జయకుమార్, పి.బెంజిమెన్, మాఫోయ్ పాండ్యరాజన్, ఆర్బీ ఉదయ్‌కుమార్, వైగై సెల్వన్, ఎస్పీ వేలుమణి, గోకుల ఇందిర, వలర్మతి, జిల్లా కార్యదర్శులు జి.వెంకటేష్‌బాబు, ఆర్ఎస్ రాజేష్, టి.నగర్ సత్య, మాజీ ఎంపీలు జయవర్ధన్, ఎస్.బాలగంగ, మాజీ కౌన్సిలర్ రాయపురం మనో సహా ఎంజీఆర్ యువజన విభాగం, విద్యార్థి విభాగం, న్యాయవాదులు, అమ్మ పేరవైలకు చెందిన నిర్వాహకులు, కార్యకర్తలు ఎంజీఆర్ జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం పార్టీ కార్యాలయం వెలుపల అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన ఈపీఎస్, పేదలకు ధోవతి, చీరలు పంపిణీ చేశారు. అలాగే, టి.నగర్‌లో ఉన్న ఎంజీఆర్ స్మారక మందిరంలో ఆయన విగ్రహానికి కాంగ్రెస్ ఎంపీ ఎస్.తిరునావుక్కరసర్, ఎంజీఆర్ కళగం ప్రధాన కార్యదర్శి రామలింగం తదితరులు పూలదండలు సమర్పించి ఘనంగా నివాళులర్పించారు.



జయ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న పళనిస్వామి, నేతలు



పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసిన పళనిస్వామి

ఎంజీఆర్‌ది దూరదృష్టి : ప్రధాని మోదీ ప్రశంస

ఎంజీఆర్ 107వ జయంతి సందర్భంగా ఆయనకు ప్రధాని నరేంద్ర మోదీ తన 'ఎక్స్' పేజీలో తమిళంలో శుభాకాంక్షలు తెలియజేశారు. రాజకీయాల్లో చరిత్ర సృష్టించిన ఎంజీఆర్ జయంతిని కోలాహలంగా జరుపుకుంటున్నామని, ఆ మహనీయుడు తమిళ సినిమా రంగానికి తగిన గుర్తింపు కలుగజేసి దూరదృష్టితో రాజకీయాల్లో కూడా రాణించగలిగారని కీర్తించారు. ఒక్క సినిమా రంగానికే కాకుండా రాజకీయాల్లో చక్రం తిప్పి పార్టీ అధ్యక్షుడిగా, ముఖ్యమంత్రిగా ప్రజా సంక్షేమం కోసం విశ్రమించకుండా కృషి చేసిన మహనీయుడని కొనియాడారు. ఇతర రాజకీయ నాయకులు ఎంజీఆర్‌ను స్ఫూర్తిగా తీసుకొని అభివృద్ధి బాటలో పయనించాలని ప్రధాని తన ఎక్స్ పేజీలో పిలుపునిచ్చారు.

సమాచార దృష్టి

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఐసిఎఫ్, జనవరి 17: విద్యుత్ మార్గాల్లో చేపట్టనున్న మరమ్మతుల కారణంగా పెరంబూర్ పరిధిలోని సిడ్కో 1 నుంచి 10వ బ్లాక్ వరకు, అమ్మన్‌కొట్టై, నెహ్రూ నగర్, తిరునగర్, సిడ్కో ఎస్టేట్, విల్లివాక్కం, బాబా నగర్, రాజు మంగళం మెయిన్ రోడ్డు, నార్త్, సౌత్ జగ న్నాథపురం, సౌత్ హైకోర్టు కాలని ప్రాంతాల్లో గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఈబీ తెలిపింది.

నేటినుంచి దక్షిణ జిల్లాల్లో వర్షాలు

ఐసిఎఫ్, జనవరి 17: దక్షిణ జిల్లాల్లో ఈనెల 18నుంచి 20వ తేదీ వరకు తేలికపాటి వర్షాలు కురుస్తాయని వాతావరణ పరిశోధన కేంద్రం తెలిపింది. ఉత్తర జిల్లాలు, పుదుచ్చేరి, కారైక్కాల్ ప్రాంతాల్లో పొడి వాతావరణం నెలకొంటుంది. ఇక నీలగిరి జిల్లాలో పొగమంచు కురుస్తుందని, చెన్నై, శివారు ప్రాంతాల్లో ఆకాశం మేఘావృతంగా ఉంటుందని వాతావరణ కేంద్రం తెలిపింది.

ఉపాధ్యాయులకు కొత్త నిబంధనలు

ఐసిఎఫ్, జనవరి 17: టెన్త్, ప్లస్‌వన్, ప్లస్‌టూ పబ్లిక్ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకన పనులు చేపట్టే ఉపాధ్యాయులకు పరీక్ష శాఖ కొత్త నిబంధనలు విధించింది. కొంతమంది ఉపాధ్యాయులు విధి నిర్వహణలో టీ తాగేందుకు బయటకు వెళ్లడం, మూల్యాంకన సమయంలో మొబైల్‌లో మాట్లాడడాన్ని గమనించామన్నారు. దీంతో ఈ విద్యా సంవత్సరం నుంచి మూల్యాంకనం చేపట్టే ఉపాధ్యాయులు వాల్యుయేషన్ కేంద్రాల నుంచి ఎట్టి పరిస్థితుల్లోను వెలుపలికి వెళ్ల రాదని నిబంధన విధించింది.

20, 21 తేదీల్లో జిల్లాస్థాయి చెస్ పోటీలు

ఐసిఎఫ్, జనవరి 17: తిరువళ్లూర్ జిల్లా చెస్ సంఘం ఆధ్వర్యంలో జిల్లాస్థాయి చెస్ పోటీలు ఈ నెల 20, 21 తేదీల్లో పూందమల్లి ప్రత్యూష ఇంజనీరింగ్ కళాశాలలో జరగనున్నాయి. 7 నుంచి 17 ఏళ్ల పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులకు వేర్వేరుగా పోటీలు నిర్వహించనున్నారు. తిరువళ్లూర్ జిల్లాకు చెందిన వారు మాత్రమే అర్హులు. వివరాలకు నెం.9444751432లో సంప్రదించాలని పోటీ సమన్వయకర్త బలరామన్ తెలిపారు.

ఇంజనీరింగ్ కళాశాలల్లో బీసీఏ కోర్సులు...?

ఐసిఎఫ్, జనవరి 17: ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలల్లో ఉన్న బీసీఏ కోర్సును ఇకపై ఇంజనీరింగ్ కళాశాలల్లో నిర్వహించేందుకు ఏఐసీటీఈ సన్నాహాలు చేస్తోంది. దేశంలో సాంకేతిక విద్య కళాశాలల్లో ఇంజనీరింగ్, ఆర్కిటెక్ట్ కోర్సులు, ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలల్లో బీబీఏ, బీసీఏ, బీఏ, బీఎస్సీ వంటి యూజీ కోర్సులు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో, కొత్త విద్యా విధానం ప్రకారం అన్నిరకాల సాంకేతిక, మేనేజ్‌మెంట్ కోర్సులు ఇకపై ఏఐసీటీఈ అనుమతి పొందాలని యూజీసీ ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. దీంతో బీసీఏ, బీబీఏ కోర్సుల నిర్వహణకు ఏఐసీటీఈ అనుమతిని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలు పొందాలని కేంద్రప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో, ఈ కోర్సులను నిర్వహించేందుకు అనుమతి ఇవ్వాలని ఏఐసీటీఈకి ఇంజనీరింగ్ కళాశాలలు విజ్ఞప్తి చేశాయి. ఈ విషయాన్ని పరిశీలిస్తున్న ఏఐసీటీఈ త్వరలో ఇంజనీరింగ్ కళాశాలకు అనుమతి ఇవ్వనున్నట్లు కౌన్సిల్ వర్గాలు తెలియజేస్తున్నాయి.

పళని ఆలయానికి సెల్‌ఫోన్‌తో వస్తే జరిమానా

పెరంబూర్, జనవరి 17: దిండుగల్ జిల్లా పళని మురుగన్ ఆలయానికి సెల్‌ఫోన్ తీసుకొచ్చే భక్తులకు జరిమానా విధిస్తామని ఆలయ అధికారులు హెచ్చరించారు. ఈ ఆలయానికి సెల్‌ఫోన్, కెమెరాలతో వస్తున్న భక్తులు ఆ ప్రాంతంలో ఫొటోలు తీస్తున్నట్లు అందిన ఫిర్యాదులపై స్పందించిన ఆలయ అధికారులు, ఆలయంలోకి సెల్‌ఫోన్, కెమెరా తీసుకెళ్లడంపై విధించిన నిషేధం గత నెల 19వ తేది నుంచి అమల్లో వచ్చింది. భక్తులు తాము తీసుకొచ్చే కెమెరాలు, సెల్‌ఫోన్లను కొండ దిగువ భాగంలో రోప్‌కార్, వించ్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక గదుల్లో ఉంచి రూ.5 చెల్లించాల్సి ఉంటుంది. స్వామి దర్శనం అనంతరం రసీదు చూపించి తమ వస్తువులు తీసుకెళ్లొచ్చు.

అసిస్టెంట్ జైలర్ ఆత్మహత్య

అడయార్, జనవరి 17:వేలూరు కేంద్ర కారాగార అసిస్టెంట్ జైలర్ తులసిరామన్ (59) ఆత్మహత్య చేసుకున్నారు. వేలూరు జిల్లా ఇడైయన్‌సత్తు గ్రామానికి చెందిన తులసిరామన్ వేలూరు సెంట్రల్ జైలులో అసిస్టెంట్ జైలర్‌గా పనిచేస్తున్నాడు. కొన్నిరోజులుగా మెడికల్ సెలవుపై ఉన్న ఆయన హృద్రోగం,డయాబెటిస్, రక్తపోటు తదితర సమస్యలతో బాధపడుతున్నారు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం 6 గంటల ప్రాంతంలో తన ఇంట్లోనే ఫ్యానుకు ఉరేసుకున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

టాయిలెట్ కూల్చి జెండా దిమ్మె నిర్మాణం

● నలుగురు బీజేపీ నేతల అరెస్టు

అడయార్, జనవరి 17: పెరంబలూరు జిల్లా వి.కళత్తూరు సమీపంలో మరవందం అనే గ్రామంలో ప్రైవేటు పాఠశాల మరుగుదొడ్డిని కూల్చివేసి పార్టీ జెండా దిమ్మెను నిర్మించిన కేసులో నలుగురు బీజేపీ నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో పార్టీ జిల్లా అధ్యక్షుడు సెల్వరాజ్, మరవందం గ్రామానికి చెందిన సురేష్, మణికంఠన్, వెంకటేశన్ ఉన్నారు. పాఠశాల ట్రస్టీ అగస్టిన్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

హిట్ అండ్ రన్ చట్టానికి వ్యతిరేకంగా సమ్మె

అడయార్, జనవరి 17: కేంద్రం ఇటీవల తీసుకొచ్చిన హిట్ అండ్ రన్ చట్టానికి వ్యతిరేకంగా నీలగిరి జిల్లాలో భారీ వాహనాల డ్రైవర్లు బుధవారం నుంచి నిరవధిక సమ్మెకు దిగారు. ఈ చట్టం కింద లారీ డ్రైవరుపై కేసు నమోదైతే పదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.7లక్షల అపరాధం కూడా విధించే అవకాశం ఉంది. ఈ చట్టానికి వ్యతిరేకంగా ఇటీవల ట్యాంకర్లు, ట్రక్కు డ్రైవ ర్లు దేశవ్యాప్తంగా సమ్మెకు తలపెట్టగా, కేంద్రం జోక్యం చేసుకుని ఈ సమ్మె ను తాత్కాలికంగా విరమించుకునేలా చేసింది. ఈ నేపథ్యంలో బుధవారం నుంచి నీలగిరి జిల్లాకు చెందిన భారీ వాహనాల డ్రైవర్లు ఈ చట్టానికి వ్యతిరేకంగా నిరవధిక సమ్మెకు దిగారు. దీంతో ఈ జిల్లా నుంచి ఇతర ప్రాంతాలకు సరఫరా అయ్యే కూరగాయలు, ఇతర నిత్యావసర సరకుల పంపిణీకి అంతరాయం ఏర్పడింది.

నదులు, సముద్రాల్లో కంచెలు

ఐసిఎఫ్, జనవరి 17: నదులు, సముద్రంలో ప్లాస్టిక్ వ్యర్థాలు కలవడాన్ని అడ్డుకొనేలా కంచెలు ఏర్పాటు చేస్తున్నట్లు రాష్ట్ర పర్యావరణ శాఖ కార్యదర్శి సుప్రియసాహు తెలిపారు. ప్రపంచ బ్యాంక్ నిధులతో రాష్ట్రంలో 14 సముద్రతీర జిల్లాల్లో రాబోయే ఐదేళ్లలో రూ.1,675 కోట్లతో సముద్రతీర ప్రక్షాళన పథకాలు అమలుకు ముఖ్యమంత్రి స్టాలిన్ అనుమతించారని పేర్కొన్నారు. ఈ పథకం కింద నదులు, సముద్రాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు చేరకుండా అడ్డుకొనేందుకు కంచెలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. అలాగే, నాగపట్టినం, చెన్నైలో సముద్ర కాలువల సంరక్షణ కేంద్రాలు, తంజావూరులో సీల్ సంరక్షణ కేంద్రా లు వంటివి అభివృద్ధి చేయనున్నామని సుప్రియ పేర్కొన్నారు.




శ్రీరంగనాథస్వామివారి ఆలయ ప్రాకారంలోని శ్రీమేట్టళగియ సింగర్ (నరసింహస్వామి) ఆలయ ప్రవేశద్వారం మెట్లను శుభ్రం చేస్తున్న గవర్నర్ ఆర్ఎన్ రవి, ఆయన సతీమణి లక్ష్మి రవి - శ్రీరంగనాథస్వామిని దర్శిస్తున్న గవర్నర్ దంపతులు

దేశమంతా రామమయం

● గవర్నర్ రవి
● శ్రీరంగం రంగనాథస్వామి ఆలయ సందర్శన

చెన్నై, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ప్రతి భారతీయుడి హృదయంలో రామచంద్రమూర్తి కొలువై ఉన్నారని, కనుకనే అయోధ్య రామాలయ కుంభాభిషేకం పట్ల దేశ ప్రజలంతా హర్షం ప్రకటిస్తున్నారని గవర్నర్ ఆర్ఎన్ రవి అన్నారు. సతీసమేతంగా ఆయన బుధవారం ఉదయం తిరుచ్చి శ్రీరంగం రంగనాథస్వామివారి ఆలయాన్ని దర్శించారు. ఆలయ నిర్వాహకులు ఆయనకు పూర్ణకుంభ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయ డిప్యూటీ కమిషనర్ మారియప్పన్, సుందర్‌భట్టర్, ప్రధానార్చకులు గవర్నర్ దంపతులను సాదరంగా ఆహ్వానించి ఆలయంలోకి తీసుకెళ్లారు. ఆ తర్వాత గవర్నర్ దంపతులు రంగనాథస్వామి, అమ్మవారి సన్నిధి, చక్రత్తాళ్వార్ సన్నిధుల్లో దేవతా మూర్తులను దర్శించారు. అటుపిమ్మట తాయార్ సన్నిధి సమీపంలో శ్రీమేట్టళగియ సింగర్ (నరసింహస్వామి) సన్నిధి మెట్లను సతీమణితో కలిసి నీటితో కడిగారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ... మానవ జీవితానికి ఆలయాలకు విడదీయరాని అనుబంధం ఉందన్నారు. గ్రామం రూపుదిద్దుకోవడానికి ముందే అక్కడ గుడి నిర్మించడం ఆనవాయితీ అని, ఆయా గుళ్ళను అనుసరించే ఆ గ్రామాలు అభివృద్ధి చెందుతుండేవని చెప్పారు. ప్రస్తుతం ఆధ్యాత్మిక ప్రకంపనలు, ఆకర్షణ శక్తులు కలిగిన ఆలయాలు ఎన్నో ఉన్నాయని, ఆంగ్లేయుల పాలనలో ఈ విషయాలన్నీ మరుగున పడ్డాయని చెప్పారు. ప్రతి భారతీయుడి హృదయంలోనూ శ్రీరాముడు కొలువుదీరి ఉండటం వల్లే రామాలయ కుంభాభిషేకం పట్ల హర్షం ప్రకటిస్తున్నారని చెప్పారు. ఆలయాలను శుభ్రపరచడం ఆలయ నిర్వాహకులకే పరిమితం కాదని, భక్తులు కూడా ఆలయ పరిసరాలను శుభ్రపరచాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం 'స్వచ్ఛ్ తీర్థ్' పేరుతో ఆలయ పరిసరాలను శుభ్రపరిచే పనులను చేపట్టాలని ప్రధాని మోదీ దేశ ప్రజలందరికీ పిలుపునిచ్చారని తెలిపారు. ఈ సమావేశం ముగిసిన తర్వాత గవర్నర్ దంపతులు కారులో మైలాడుదురైకి బయలుదేరి వెళ్లారు.

గవర్నర్‌కు నల్లజెండాల స్వాగతం

● 50 మంది డీపీఐ కార్యకర్తల అరెస్టు



నల్లజెండాలతో ధర్నా చేస్తున్న డీపీఐ కార్యకర్తలు

చెన్నై, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): శ్రీరంగం పర్యటనను ముగించుకుని మైలాడుదురైకి వెళ్తున్న రాష్ట్ర గవర్నర్ ఆర్.ఎన్.రవికి నల్లజెండాలతో నిరసన తెలిపేందుకు ప్రయత్నించిన డీపీఐ కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేశారు. గవర్నర్ కాన్వాయ్ జయంకొండం మీదుగా మైలాడుదురైకి వెళ్లనున్నట్లు ముందుగానే తెలుసుకుని డీపీఐ నాయకుడు కదిర్‌వలవన్ నాయకత్వంలో కార్యకర్తలు నల్లజెండాలతో తరలివెళ్లారు. వీరందరూ జయంకొండం క్రాస్ రోడ్డు జంక్షన్ వద్ద గుమికూడి నల్లజెండాలు చేతపట్టుకుని గవర్నర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పోలీసులు జోక్యం చేసుకుని అందరిని అరెస్టు చేసి వ్యాన్‌లో తరలించారు.

రూ.300 కోట్ల విక్రయాలు

ఐసిఎఫ్, జనవరి 17: స్థానిక కోయంబేడు మార్కెట్లో రూ.300 కోట్లకు విక్రయాలు జరిగినట్లు వ్యాపారులు తెలిపారు. సంక్రాంతిని పురస్కరించుకొని ఈ మార్కెట్లో పొంగల్ సామగ్రి వస్తువుల విక్రయాలు ఊపందుకున్నాయి. ఈ నెల 15, 16 తేదీల్లో మాత్రమే రూ.300 కోట్లకు పైగా వ్యాపారాలు జరిగాయని, కిరాణా సరుకుల మార్కెట్లో రూ.100 కోట్లకు పైగా విక్రయాలు జరిగాయని వ్యాపారులు తెలిపారు.

కొడైకెనాల్ జలపాతంలో స్నానాలకు వెళ్లిన ఇద్దరు గల్లంతు

ప్యారీస్, జనవరి 17: దిండుగల్ జిల్లాలో ప్రసిద్ధి చెందిన విడిది కేంద్రం కొడైకెనాల్ పర్యటనకు వెళ్లిన ఇద్దరు జలపాతంలో స్నానానికి వెళ్లి గల్లంతయ్యారు. వీరి కోసం స్థానిక అగ్నిమాపక శాఖ సిబ్బంది గాలిస్తున్నారు. పోలీసుల కథనం మేరకు... కోయంబత్తూర్‌లో ఉన్న ఓ ప్రైవేటు కళాశాలలో మూడో సంవత్సరం చదువుకుంటున్న కొడైకెనాల్‌కు చెందిన ఆరుగురు యువకులు మంగళవారం కొడైకెనాల్ విల్‌పట్టి పంచాయతీ పరిధిలో ఉన్న పంచ జలపాతాల వద్దకు స్నానానికి వెళ్లారు. సరదాగా స్నానమాచరిస్తున్న సమయంలో గోకుల్(20), నజీర్(20) గల్లంతయ్యారు. వారి వెంట ఉన్న వారు గల్లంతైన వారి కోసం స్థానికుల సహకారంతో తీవ్రంగా గాలించినా జాడ తెలియలేదు. అగ్నిమాపక, అటవీ, పోలీసు శాఖ అధికారులకు సమచారం అందించడంతో, వారు అక్కడికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు.

రైలునుంచి జారిపడి హైదరాబాద్‌వాసి మృతి

చెన్నై, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూర్ జిల్లా పుట్లూరు రైల్వేస్టేషన్ వద్ద కదులుతున్న సబర్బన్ రైలు నుంచి కిందకు దిగేందుకు యత్నించిన హైదరాబాద్‌వాసి వెంకటనాగేశ్వరరావు (50) మృతి చెందాడు. బుధవారం ఉదయం తిరుత్తణి నుంచి చెన్నైకి బయలుదేరిన సబర్బన్ రైలు పుట్లూరు రైల్వేస్టేషన్‌లో ఆగకముందే నాగేశ్వరరావు దిగేందుకు యత్నించాడు. ఈ ఘటనలో కాలుజారిపడిన అతని తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మరణించాడు. తిరువళ్లూర్ రైల్వే పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

రూబిక్స్ క్యూబ్ గేమ్‌లో చెన్నై బాలుడి గిన్నిస్ రికార్డు

ప్యారీస్, జనవరి 17: రూబిక్స్ క్యూబ్‌లో చెన్నైకి చెందిన బాలుడు పతకాల పంట పండిస్తున్నాడు. డాక్టర్ రాజ్‌మోహన్- డాక్టర్‌హేమలత దంపతుల 16 ఏళ్ల కుమారుడు హెచ్ఆర్ కనిష్ అన్నానగర్‌లోని శ్రీ అక్షయం హాలులో మంగళవారం ఉదయం 7.45 నుంచి బుధవారం ఉదయం 7.45 గంటల వరకు నిరవధికంగా రోటేటింగ్ పజిల్ క్యూబ్స్ గేమ్‌లో గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్నాడు. తమిళనాడు క్యూబ్ అసోసియేషన్, గిన్నిస్ సంస్థ తమిళనాడు ప్రతినిధులు ఆనంద్ రాజేంద్రన్, ఆర్.బిందు ప్రియాంక, డాక్టర్ చంద్రిక సమక్షంలో క్యూబ్ పజిల్స్‌ను 9,732 సార్లు అమర్చి ఇప్పటివరకు రికార్డులో ఉన్న 5 వేల పాయింట్లను అధిగమించాడు. కనిష్ ప్రస్తుతం చెన్నై పబ్లిక్ స్కూలులో ప్లస్‌వన్ చదువుకుంటూ, తమిళనాడు క్యూబ్ అసోసియేషన్‌లో శిక్షణ పొందాడు. గిన్నిస్ రికార్డు నెలకొల్పిన కనిష్‌ను సీనియర్ పాత్రికేయుడు నక్కీరన్ గోపాల్, డాక్టర్ కన్నన్, న్యాయవాది పీఎస్ జయశంకర్‌తో పాటు పలువురు ప్రముఖులు ప్రశంసించారు.



అలంగానల్లూరులో జరిగిన జల్లికట్టు వేడుకల్లో ఆలయ ఎద్దును చూపుతున్న మంత్రి ఉదయనిధి

150వ పడిలోకి భారత వాతావరణ పరిశోధన శాఖ



చెన్నైలోని వాతావరణ కేంద్రంలో జరిగిన వేడుకల్లో సిబ్బంది

ఐసిఎఫ్, జనవరి 17: భారత వాతావరణ పరిశోధన శాఖ 150 వసంతాలు పూర్తి చేసుకుంది. 1875వ సంవత్సరంలో భారత ప్రభుత్వ మొదటి వైజ్ఞానిక శాఖల్లో వాతావరణ పరిశోధన శాఖ ఒకటిగా ఏర్పడి సేవలందిస్తోంది. సోమవారం 150వ ఏట అడుగుపెట్టిన ఈ శాఖ వార్షికోత్సవాలు అన్ని రాష్ట్రాల ప్రధాన నగరాల్లో ఉన్న వాతావరణ పరిశోధన కేంద్రాల్లో జరిగాయి. చెన్నై వాతావరణ పరిశోధన కేంద్రం విడుదల చేసిన ప్రకటనలో... దేశ తొలి వాతావరణ సమాచారాన్ని నమోదు చేసే ప్రయోగశాల చెన్నైలో 1875లో ప్రారంభమైందని తెలిపింది. ఇది ఆసియాలోనే అతిప్రాచీన పరిశోధన కేంద్రమని పేర్కొంది. ఇక మండలస్థాయి వాతావరణ పరిశోధన కేంద్రాలకు ఈ ఏడాది 80వ వ్యవస్థాపక వార్షికోత్సవమనింది. భారత వాతావరణ పరిశోధన శాఖ 150 ఏళ్ల చరిత్ర, సేవలపై ప్రజలకు అవగాహన కల్పించేలా కార్యక్రమాలు చేపట్టడంతో పాటు ఏడాది పొడవునా ఉత్సవాలు నిర్వహించనున్నారు.

తిరుచ్చి- చెన్నై రహదారి పునరుద్ధరణ పనులు ప్రారంభం

ఐసిఎఫ్, జనవరి 17: తిరుచ్చి - చెన్నై జాతీయ రహదారి పునరుద్ధరణ పనులు ప్రారంభమయ్యాయి. ఈ రహదారిలో పొన్‌మలై విభాగం జీకార్నర్ సమీపంలో ఉన్న రైల్వే ఫ్లైఓవర్ ఒకవైపు మట్టి కోత ఏర్పడడంతో ఈనెల 11వ తేది నుంచి వాహన రాకపోకలు నిలిపివేశారు. ఐఐటీ సివిల్ ఇంజనీరింగ్ శాఖ నిపుణులు ఈ వంతెనను తనిఖీ చేశారు. నిపుణుల సలహా మేరకు పొన్‌మలై రైల్వేస్టేషన్ సమీపంలో దెబ్బతిన్న వంతెనను పటిష్ఠ పరిచే పనులు బుధవారం ప్రారంభమయ్యాయి. జాతీయ రహదారుల కమిషన్ ఆధునిక యంత్రాలతో చేపడుతున్న ఈ మరమ్మతులు నెలరోజుల్లో పూర్తికానున్నాయని అధికారులు తెలిపారు.

అన్నాడీఎంకే పోస్టరులో ఎంజీఆర్ స్థానంలో అరవిందస్వామి



అడయార్, జనవరి 17: అన్నాడీఎంకే వ్యవస్థాపకుడు ఎంజీఆర్ 107వ జయంతి వేడుకలను పురస్కరించుకుని తిరుపత్తూరు జిల్లా ఆంబూరు సమీపంలోని మాదనూరుకు చెందిన పార్టీ కార్యకర్తలు వాల్‌పోస్టర్లను అంటించడం స్థానికంగా చర్చనీయాంశమైంది. ఈ పోస్టర్లలో తమ ఆరాధ్య నేత ఎంజీఆర్ ఫొటో స్థానంలో సీనియర్ నటుడు అరవిందస్వామి ఫొటోను ముద్రించారు. 'తలైవి' చిత్రంలో అరవిందస్వామి ఎంజీఆర్ పాత్రధారిగా నటించారు. ఈ ఫొటో అచ్చం ఎంజీఆర్‌ను పోలినట్టుగా ఉండటంతో అరవిందస్వామినే నిజమైన ఎంజీఆర్ అనుకుని ఆ ఫొటోతో వాల్‌పోస్టర్లను ముద్రించారు. ఇందులో దివంగత నేత జయలలిత, పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి కె.పళనిస్వామితో పాటు స్థానిక నాయకుల ఫొటోలను ముద్రించారు.

ఏర్కాడులో పర్యాటకుల సందడి



చెన్నై, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): పేదల ఊటీగా పేరుగడించిన సేలం జిల్లా ఏర్కాడులో బుధవారం పర్యాటకు లు సందడి చేశారు. అక్కడి జింకల పార్కు, అన్నా పార్కు, బోట్ హౌస్, సేర్వరాయన్ కోయిల్, పకోడా పాయింట్, లేడీస్ సీట్ తదితర ప్రాంతాల్లో సేలం జిల్లావాసులే కాకుండా పొరుగు రాష్ట్రాలకు చెందినవారు కూడా తరలివచ్చారు. దీనితో అక్కడి పర్యాటక ప్రాంతాలు పర్యాటకులతో కిటకిటలాడాయి. బోట్‌హౌస్ సరస్సులో పర్యాటకులు పడవలపై విహరించారు.

శివనాడార్ విశ్వవిద్యాలయంలో డిగ్రీ కోర్సులకు ప్రవేశపరీక్ష



చెన్నై, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): శివనాడార్ విశ్వవిద్యాలయం 2024-25 విద్యా సంవత్సరానికి గాను అండర్ గ్రాడ్యుయేట్ అడ్మిషన్ల కోసం కామన్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్ (ఎస్ఎన్‌యూసీఈఈ-2024)ను నిర్వహించనున్నదని ఆ విశ్వవిద్యాలయం వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ శ్రీమన్‌కుమార్ భట్టాచార్య తెలిపారు. ఈ కంప్యూటర్ ఆధారిత ఆఫ్‌లైన్ పరీక్ష దేశవ్యాప్తంగా జరుగుతుందని, విద్యార్థులు తమ నివాస ప్రాంతాలకు చేరువగా ఉన్న పరీక్షా కేంద్రాలను ఎంపిక చేసుకోవచ్చన్నారు. అంతర్జాతీయ విద్యార్థుల కోసం దుబాయ్‌లో పరీక్ష కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేశామన్నారు. 12వ తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణులైనవారు, ఆ పరీక్షలు రాసి ఫలితాల కోసం వేచి ఉంటున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఇక ప్రవేశపరీక్షలో ఉత్తీర్ణులైన తర్వాత ఇంటర్వ్యూ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తామని తెలిపారు. ప్రవేశపరీక్షకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు 12వ తరగతి పరీక్షల్లో కనీసం 75% మార్కులు పొందవలసి ఉంటుందని వివరించారు. జేఈపీ మెయిన్‌లో 90 శాతం అంతకంటే ఎక్కువ మార్కులు పొందిన భారతీయ విద్యార్థులు ఈ ప్రవేశ పరీక్షతో నిమిత్తం లేకుండా నేరుగా అడ్మిషన్లు పొందవచ్చని పేర్కొన్నారు. ప్రవేశపరీక్షల కోసం పేర్లను నమోదు చేసుకోదలచినవారు www.snuchennai.edu. in/admission అనే వెబ్‌సైట్‌ను సందర్శించాలని ఆయన తెలిపారు.



టి.నగర్ టీటీడీ ఆలయంలో శ్రీరామజన్మభూమి క్షేత్ర ప్రాణ ప్రతిష్ఠ వేడుకల్లో బుధవారం సాయంత్రం శాక్సఫోన్ వాద్య, గాత్ర కచేరి చేసిన రాఘవన్ మణియన్‌ను సత్కరిస్తున్న స్థానిక సలహామండలి సభ్యులు మోహన్‌రావు, పీవీఆర్ కృష్ణారావు తదితరులు

మృతుల కుటుంబాలకు సీఎం స్టాలిన్ ఓదార్పు

అడయార్, జనవరి 17: మదురై జిల్లా తారాపురం తాలూకా అమరావతి నదిలో స్నానానికి వెళ్ళిన ముగ్గురు యువకులు ప్రాణాలు కోల్పోయారు. ఈ విషాదకర ఘటనపై ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తన విచారాన్ని, సంతాపాన్ని వ్యక్తం చేశారు. అంతేకాకుండా, మృతుల కుటుంబాలకు ఆయన తన ప్రగాఢ సంతాపం సానుభూతిని తెలుపుతూ, మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల ఆర్థిక సాయం అందజేయాలని ఆయన ఆదేశించారు. కాగా, మంగళవారం సాయంత్రం జరిగిన ఈ విషాదకర ఘటనలో మదురై జిల్లా ఆలంకుళంకు చెందిన భాగ్యరాజ్ (39), చిన్న కరుప్పు (31), హరి (16) అనే ముగ్గురు ప్రాణాలు కోల్పోయిన విషయం తెల్సిందే.

ఆయి అమ్మాళ్‌తో మంత్రి ఉదయనిధి భేటి



ఆయి అమ్మాళ్‌ను శాలువతో సత్కరిస్తున్న మంత్రి ఉదయనిధి

చెన్నై, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మదురైలో నివసిస్తున్న ఆయి అమ్మాళ్ అలియాస్ పూర్ణం అమ్మాళ్‌ను రాష్ట్ర యువజన సంక్షేమం, క్రీడాభివృద్ధి శాఖల మంత్రి ఉదయనిధి ,బుధవారం ఉదయం మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఆయి అమ్మాళ్ ఇటీవల మృతి చెందిన తన కుమార్తెకు స్మృత్యంజలి ఘటించేలా మదురై కొడికుళం ప్రభుత్వ మాధ్యమిక పాఠశాలలో అదనపు తరగతి గదులు నిర్మించేందుకు 1.5 ఎకరాల భూమిని విరాళంగా అందజేశారు. ఈ సమాచారం తెలుసుకున్న ముఖ్యమంత్రి స్టాలిన్ ఆమె దాతృత్వాన్ని ప్రశంసించారు. రిపబ్లిక్ డే వేడుకల్లో ఆమెను ఘనంగా సత్కరించి సేవా అవార్డును కూడా ప్రదానం చేయనున్నట్లు ప్రకటించారు. ఈ నేపథ్యంలో మదురై అలంగానల్లూరు జల్లికట్టు పోటీలను ప్రారంభించేందుకు వెళ్ళిన ఉదయనిధి ఆయి అమ్మాళ్‌ను ఆమె నివాసగృహంలో కలుసుకుని శాలువతో సత్కరించారు. ఆమె కుటుంబ సభ్యులు, చుట్టుపక్కల ఇళ్లలో నివసిస్తున్నవారితో కాసేపు కబుర్లాడారు.

శీతల పానీయంలో మూత్రం

● ఇద్దరు లా విద్యార్థుల సస్పెండ్

పెరంబూర్, జనవరి 17: శీతల పానీయంలో మూత్రం పోసి సహచర విద్యార్థితో తాగించిన ఇద్దరు సీనియర్ విద్యార్థులపై సస్పెన్షన్ వేటుపడింది. తిరుచ్చి జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో 600 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ కళా శాలలో చివరి సంవత్సరం చదువుతున్న ఇద్దరు విద్యార్థులు ఈనెల 13న శీతల పానీయంలో మూత్రం పోసి సహచర విద్యార్థితో తాగించినట్లు సమాచారం. బాధిత విద్యార్థి ఫిర్యాదుతో ముగ్గురు ప్రొఫెసర్లతో విచారణకు వర్శిటీ వైస్ ఛాన్సలర్ నాగరాజ్ ఉత్తర్వులు జారీ చేశారు. వారి నివేదిక ఆధారంగా ఈ అమానుషానికి పాల్పడిన ఇద్దరు విద్యార్థులను సస్పెండ్ చేస్తూ వీసీ ఉత్తర్వులు జారీ చేశారు.

ధనుష్‌పై కేసు నమోదు కోరుతూ దాఖలైన పిటిషన్ తోసివేత

అడయార్, జనవరి 17: హీరో ధనుష్‌పై కేసు నమోదు చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది 2014లో ధనుష్ హీరోగా 'వేలైయిల్లా పట్టాదారి' చిత్రం వచ్చింది. ఈ సినిమా పోస్టర్లలో హీరో ధనుష్ పొగ తాగుతున్నట్టుగా ముద్రించారు. ఈ సినిమాలోని పలు సన్నివేశాల్లో ధనుష్ పొగతాగుతూ కనిపిస్తారు. దీంతో ధనుష్‌తో పాటు ఆ చిత్ర నిర్మాత, పంపిణీదారులపై కేసు నమోదు చేయాలంటూ అలెగ్జాండర్ అనే వ్యక్తి సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై పలు దఫాలుగా విచారణ జరిపిన అపెక్స్ కోర్టు... తుది తీర్పును వెల్లడించింది. సినిమా వాల్‌పోస్టర్లలో కనిపించేవారికి, పొగతాగే వస్తువులు లేగా పొగతాగే సన్నివేశాలకు డైలాగులకు ఎలాంటి సంబంధం లేదు. పైగా పొగాకు ఉత్పత్తి కంపెనీలు ఈ పోస్టర్లను ముద్రించి గోడలకు అంటించలేదు. అందువల్ల పొగాకు ఉత్పత్తులను ప్రోత్సహించేలా ఉందని భావించడానికి వీల్లేదని పేర్కొంటూ ఆ పిటిషన్‌ను తోసిపుచ్చింది.

కుమార్తెపై లైంగిక వేధింపులు : తండ్రి అరెస్ట్

పెరంబూర్, జనవరి 17: తొమ్మిదేళ్ల కుమార్తెపై లైంగిక వేధింపులకు పాల్పడిన కామాంధ తండ్రిని పోలీసులు అరెస్ట్ చేశారు. 39 ఏళ్ల మహిళ ఓ మహిళా పోలీస్ స్టేషన్‌లో చేసిన ఫిర్యాదులో... తనకు 10 ఏళ్ల క్రితం వివాహం కాగా, ముగ్గురు కుమార్తెలున్నారన్నారు. వారిలో 9 ఏళ్ల పెద్ద కుమార్తె 5వ తరగతి చదువుతోందని పేర్కొన్నారు. ఈ నెల 1వ తేది పెద్ద కుమార్తె ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో మద్యం మత్తులో వచ్చిన తన భర్త, కుమార్తెపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారని, ఈ విషయాన్ని ఈనెల 15వ తేది ఏడుస్తూ తనకు తెలిపిందని పేర్కొన్నారు. ఈ ఘటనపై ఇన్‌స్పెక్టర్ కన్నగి విచారణ చేపట్టి పోక్సో కింద కేసు నమోదు చేసి, మణికంఠన్ (37) అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచి జైలుకు తరలించారు.

రూ.80 కోట్లతో వళ్లువర్‌కోట్టం పునరుద్ధరణ

ఐసిఎఫ్, జనవరి 17: స్థానిక నుంగంబాక్కంలో ఉన్న వళ్లువర్‌కోట్టం పునరుద్ధరణ పనులు రూ.80 కోట్లతో ప్రారంభమయ్యాయి. దివంగత మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి నిర్మించిన వళ్లువర్‌కోట్టంలో సరైన పర్యవేక్షణ లేక అక్కడక్కడా బీటలు వారడంతో పాటు కళావిహీనంగా కనిపిస్తోంది. దీంతో మరమ్మతులు చేపట్టేందుకు ప్రభుత్వం నిర్ణయించి నిధులు కేటాయించింది. ఈ పనులు ఏడాదిలోగా పూర్తిచేయనున్నట్లు ప్రజాపనుల శాఖ అధికారులు తెలిపారు.

టీఎన్ఈబీలో క్యూ ఆర్ కోడ్ పరిచయం

ప్యారీస్, జనవరి 17: కొత్త విద్యుత్ కనెక్షన్, ఫిర్యాదు, విద్యుత్ బిల్లుల చెల్లింపు తదితర వసతులు వినియోగదారులు పొందేలా తమిళనాడు విద్యుత్ బోర్డు (టీఎన్ఈబీ) క్యూ ఆర్ కోడ్‌ను పరిచయం చేసింది. రాష్ట్రంలోని విద్యుత్ వినియోగదారుల సౌకర్యార్థం టీఎన్ఈబీ కొత్త పథకాలను, వసతులను పరిచయం చేస్తోంది. ఆ రీతిలో పరిశ్రమలు, వాణిజ్య సంస్థల విద్యుత్ కనెక్షన్లలో సెల్‌ఫోన్ యాప్ ద్వారా విద్యుత్ మీటరు రీడింగ్ సదుపాయాన్ని కల్పించింది. విద్యుత్ మీటర్లు, స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లకు వేర్వేరుగా నెంబర్లు కేటాయించింది. ఈ మీటర్లలో క్యూ ఆర్ కోడ్ స్కాన్ నెంబరు, సీరియల్ నెంబర్లు, ఆంగ్ల అక్షరాల్లో అన్ని వివరాలను పొందుపరిచింది. టీఎన్ఈబీ క్యూ ఆర్ కోడ్ రాష్ట్రప్రజలకు పరిచయం చేసినందు వల్ల విద్యుత్ సేవలను విద్యుత్ వినియోగదారులు తమ సెల్‌ఫోన్ల ద్వారా సులువుగా తెలుసుకొనే సౌలభ్యం కల్పించారు.

గ్రామసభల్లో పాఠశాలలపై మాట్లాడండి

ఐసిఎఫ్, జనవరి 17: ఈనెల 26వ తేది జరిగే గ్రామసభల్లో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి పథకాల గురించి చర్చించాలని పాఠశాల విద్యాధికారులు, ఉపాధ్యాయు లకు పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని అన్ని పంచాయతీల్లో ఈ సభలు నిర్వహించాలని, పంచాయతీ అధ్యక్షులు, సభ్యులు, పంచాయతీ యూనియన్ అధ్యక్షులు, ఉపాధ్యక్షుడు, సభ్యులు, ఆ నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, స్థానిక సంస్థల అధికారులు పాల్గొనాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ సమావేశాల్లో పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో అధికారులు, పాఠశాల హెచ్‌ఎంలు ఆయా ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలల హోదాను పెంచడం, మౌలిక వసతుల ఏర్పాటు, విద్యార్థుల చేరిక, పారిశుధ్య పనులు తదితరాపై చర్చించాలని పాఠశాల విద్యాశాఖ సూచించింది.



దివంగత మాజీ సీఎం ఎంజీఆర్ 107వ జయంతి సందర్భంగా గిండిలోని తమిళనాడు డాక్టర్ ఎంజీఆర్ వైద్య విశ్వవిద్యాలయం ప్రాంగణంలోని ఆయన విగ్రహానికి నివాళి అర్పిస్తున్న మంత్రులు అన్బరసన్, శేఖర్‌బాబు, మేయర్ ప్రియ, తమిళభాషాభివృద్ధి సమాచారశాఖ కార్యదర్శి ఆర్.సెల్వరాజన్ తదితరులు


'తంగలాన్'లో విక్రమ్

మళ్లీ వెనక్కి తగ్గిన 'తంగలాన్'

చియాన్ విక్రమ్ - పా.రంజిత్ కాంబినేషన్‌లో రూపొందుతున్న 'తంగలాన్' చిత్రం విడుదల మరోమారు వాయిదా పడింది. తొలుత సంక్రాంతికి, ఆ తర్వాత రిపబ్లిక్ డేకి విడుదల చేయనున్నట్టు నిర్మాణ సంస్థలు ప్రకటించాయి. ఇపుడు గణతంత్ర వేడుకలకు రిలీజ్ చేయడం లేదని చిత్ర యూనిట్ పోస్టరు ద్వారా వెల్లడించింది. తేదీని బహిర్గతం చేయకుండానే ఏప్రిల్‌లో విడుదల చేయనున్నట్టు పేర్కొంది. తమిళ కొత్త సంవత్సరాదికి విడుదల చేయొచ్చన్నది కోలీవుడ్ వర్గాల సమాచారం. కాగా, పా.రంజిత్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో హీరోయిన్‌గా మాళవికా మోహనన్ నటించగా, పార్వతి, పశుపతి ఇతర ముఖ్య పాత్రలను పోషించారు. కోలార్ గోల్డ్ ఫ్యాక్టరీ నేపథ్యంలో తమిళ కార్మికుల జీవితాలను ఆధారంగా చేసుకుని తెరకెక్కించారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకోగా, నిర్మాణాంతర పనులు జరుగుతున్నాయి.



19నుంచి యూరోపియన్ ఫిల్మ్ ఫెస్టివల్

చిత్రజ్యోతి

ఈ నెల 19వ తేదీ నుంచి 28వ తేదీ వరకు పది రోజులపాటు చెన్నైలో యూరోపియన్ ఫిల్మ్ ఫెస్టివల్ జరగనుంది. యూరోపియన్ యూనియన్ దౌత్య కార్యాలయంతో కలిసి ఇండో సినీ అప్రిసియేషన్ ఆర్గనైజేషన్ ఈ చిత్రోత్సవాలను నిర్వహించనుంది. ఇందులో 25 భాషల్లో 28 రకాల అవార్డులను ప్రదానం చేయనున్నారు. ముఖ్యంగా యూరోపియన్ మహిళల జీవితాలను కేంద్రంగా చేసుకుని నిర్మించిన చిత్రాలను ఇందులో ప్రధానంగా ప్రదర్శిస్తారు. వీటిలో 18 మహిళా దర్శకులు దర్శకత్వం వహించిన చిత్రాలు ప్రదర్శించనున్నారు. ప్రపంచ ప్రఖ్యాత దర్శకుడు ఆసియోప్ డైరెక్ట్ చేసిన 'సెయింట్ ఓమర్' చిత్రాన్ని కూడా ప్రదర్శించనున్నారు. ఈ చిత్రోత్సవాలను తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాల ఫ్రాన్స్ డిప్యూటీ అంబాసిడర్ డాక్టర్ ఫాట్రిసియా టెరిహార్ట్ ప్రారంభిస్తారు.

సంక్రాంతి చిత్రాల కలెక్షన్లు ఎంత?

రూ.50 కోట్లు క్రాస్ చేసిన 'అయలాన్'


'అయలాన్'లో శివకార్తికేయన్ - రకుల్ ప్రీత్ సింగ్

సంక్రాంతి పండుగకు నలుగురు ప్రధాన హీరోలు నటించిన చిత్రాలు విడుదలయ్యాయి. వీటిలో శివకార్తికేయన్ నటించిన 'అయలాన్' చిత్రం సూపర్ హిట్ టాక్‌తో దూసుకు పోవడమేకాకుండా, కలెక్షన్ల వర్షం కురిపిస్తోంది. ఈనెల 12న విడుదల కాగా తొలి నాలుగు రోజుల్లోనే రూ.50 కోట్ల గ్రాస్‌ను రాబట్టింది. ఇప్పటికీ హౌస్‌ఫుల్ కలెక్షన్లతో ప్రదర్శితమవుతోంది. త్వరలోనే రూ.100 కోట్ల క్లబ్‌లోకి చేరుతుందని కోలీవుడ్ ట్రేడ్ వర్గాలు పేర్కొంటున్నాయి.పైగా ఈనెల26వ తేదీ వరకు కొత్త చిత్రాల విడుదల లేకపోవడంతో 'అయలాన్'కు ఎలాంటి అడ్డంకులు ఉండబోవు. ఇక మిగిలిన మూడు చిత్రాల్లో ధనుష్ నటించిన 'కెప్టెన్ మిల్లర్' పాజిటివ్ టాక్‌ను తెచ్చుకుంది. అయితే, కలెక్షన్ల పరంగా రూ.100 కోట్లు సాధిస్తేనే లాభాలు వచ్చే అవకాశం ఉందని కోలీవుడ్ టాక్. బాలీవుడ్ నటి కత్రినా కైఫ్, విజయ్ సేతుపతి 'మెర్రీ క్రిస్మస్' చిత్రం నిరాశపరచగా, అరుణ్ విజయ్ నటించిన 'మిషన్ చాప్టర్-1' ఫర్వాలేదనిపిస్తోంది.

'కంగువా' సెకండ్ లుక్



హీరో సూర్య నటిస్తున్న 'కంగువా' చిత్రం సెకండ్ లుక్‌ను కనుమ పండుగ సందర్భంగా చిత్ర యూనిట్ విడుదల చేసింది. యూవీ క్రియేషన్స్ సహకారంతో స్టూడియో గ్రీన్ బ్యానరుపై కేఈ జ్ఞానవేల్ రాజా భారీ బడ్జెట్‌తో నిర్మించే ఈ చిత్రం పది భాషలకుపైగా పాన్ వరల్డ్ మూవీగా రూపొందుతోంది. చిరుతై శివ దర్శకుడు. ఈ మూవీకి సంబంధించి ఇప్పటికే విడుదల చేసిన మూవీ గ్లింప్స్, వీడియో, పోస్టర్లు ప్రేక్షకుల్లో భారీ అంచనాలను పెంచేశాయి. ఈ నేపథ్యంలో కనుమ పండుగను పురస్కరించుకుని సెకండ్ లుక్‌ను విడుదల చేశారు. ఫస్ట్‌లుక్‌లో హీరో సూర్య భయంకరంగా, గంభీరమైన వారియర్ లుక్‌లో కనిపించారు. ఇక సెకండ్ లుక్ విషయానికొస్తే... మోడ్రన్ లుక్‌లో కనిపించారు. ఆధునిక కాలానికి సంబంధించిన వ్యక్తిగా పరిచయమయ్యారు. రెండు వేర్వేరు కాలాల్లో సాగే కథలా ఉన్నట్టు ఈ రెండు పోస్టర్లను చూస్తే అర్థమవుతుంది. ఈ పోస్టర్‌తో పాటు 'కాలం కంటే గమ్యం బలమైనది. గతం, వర్తమానం, భవిష్యత్.. అన్నింటిలో ప్రతిధ్వనించే పేరే కంగువా' అంటూ పేర్కొన్నారు. దేవీశ్రీ ప్రసాద్ సంగీతం సమకూర్చే ఈ చిత్రాన్ని ఏప్రిల్‌లో విడుదల చేసేలా సన్నాహాలు చేస్తున్నారు. అలాగే, ఈ చిత్రం తర్వాత హీరో సూర్య వరుసగా మూడు చిత్రాల్లో నటించనున్నారు.

రజనీ అభిమానులతో పొరుగింటి వృద్ధ మహిళ వాగ్వాదం


ఆగ్రహం వ్యక్తం చేస్తున్న వృద్ధ మహిళ

● వీడియో వైరల్

సూపర్‌స్టార్ రజనీకాంత్‌తో పాటు ఆయన అభిమానులపై ఓ వృద్ధ మహిళ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పండగులు, పుట్టిన రోజు వేడుకల సమయంలో తమకు మనశ్శాంతి లేకుండా చేస్తున్నారని, పండుగ పూట దేవుడికి పూజ కూడా ప్రశాంతంగా చేసుకోలేకపోతున్నట్టు ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. తేనాంపేటలోని పొయెస్ గార్డెన్‌లో రజనీకాంత్ నివాసం ఉంటున్నారు. ఆయన పుట్టిన రోజుతో పాటు పండుగల సమయంలో శుభాకాంక్షలు చెప్పేందుకు రజనీ నివాసానికి భారీగా అభిమానులు తరలివస్తుంటారు. ఆ సమయంలో రజనీకాంత్ ఇంట్లో లేకపోయినప్పటికీ ఆయన అభిమానులు మాత్రం ఇంటి గేటు వద్దే నానా హంగామా సృష్టిస్తున్నారు. సంక్రాంతి పండుగ రోజున కూడా ఇదేవిధంగా ప్రవర్తించారు. దీంతో రజనీకాంత్ పొరుగింటి వృద్ధ మహిళ అభిమానులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వారితో వాగ్వాదానికి దిగారు. ఆ వృద్ధ మహిళ మాట్లాడిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. 'తలైవా తలైవా అంటూ ఫ్యాన్స్ నినాదాలు చేస్తుంటారు. మాతో పాటు ఈ వీధిలో ఉన్న 21 గృహాల వారు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఏం.. మీ(రజనీ) ఇంటి గేటు తెరిచి అభిమానులను ఇంట్లోకి పిలవొచ్చు కదా. అక్కడే తలైవర్‌ను చూడొచ్చు కదా. మీరు గేట్లు మూసివేసివుంటారు.. వీరంతా మా గృహాల వాకిళ్లలో కూర్చొని నానా హంగామా చేస్తుంటారు. మేం కూడా పన్ను చెల్లిస్తున్నాం. కానీ, మాకు ఒక్క ప్రయోజనం కూడా లేదు. చివరకు పండుగ రోజుల్లో కూడా ప్రశాంతంగా దేవుడిని పూజించేందుకు లేదు' అంటూ వాపోయారు.


వాడివాసల్ వద్ద వేగంగా పరుగెత్తుతున్న ఎద్దు

యువకుల పట్టు నుంచి తప్పించుకుంటున్న ఎద్దు

ఎద్దు మోపురాన్ని పట్టుకుని ఎగురుతున్న యువకుడు

ఎద్దును అణచివేస్తున్న యువకుడు

ఎద్దు మోపును పట్టుకున్న యువకుడు

ఓ ఎద్దును అణచివేస్తున్న యువకుడు

తనను పొడవకుండా ఎద్దు కొమ్ములను పట్టుకున్న యువకుడు

పోట్లగిత్తలతో పోరాటం

● అలంగానల్లూరులో ఆద్యంతం ఉత్కంఠ ● గగుర్పాటుకు గురైన ప్రేక్షకులు ● 78 మందికి గాయాలు

చెన్నై, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన మదురై జిల్లా అలంగానల్లూరు జల్లికట్టు బుధవారం ఉదయం అట్టహాసంగా ప్రారంభమైంది. ఈ పోటీలను తిలకించేందుకు 75 మంది విదేశీయులు వచ్చారు. ఈ పోటీలు ఆద్యంతం గగుర్పాటు కలిగించేలా కొనసాగాయి. ఒక్కో రౌండ్‌కు వంద ఎద్దులను విడిచారు. ప్రతి రౌండ్‌లో పసుపు, ఆకుపచ్చ రంగులు కలిగిన టీషర్టులు ధరించిన 50 మంది యువకులు పాల్గొన్నారు.ఇంతటి అద్భుతాలకు ఆలవాలంగా నిలిచిన ఈ అలంగానల్లూరు జల్లికట్టును రాష్ట్ర యువజన సంక్షేమం, క్రీడాభివృద్ధి శాఖల మంత్రి ఉదయనిధి పచ్చజెండా ఊపి ప్రారంభించారు.

ముప్పుతిప్పలు పెట్టిన ఎద్దులు...

తొలుత జల్లికట్టులో పాల్గొనేందుకు సిద్ధంగా ఉన్న యువకుల చేత కలెక్టర్ సంగీత జంతు హింస నిరోధక ప్రతిజ్ఞ చేయించారు. ఈ జల్లికట్టులో మేలిమి జాతికి చెందిన ఎద్దులు అధికంగా పాల్గొన్నాయి. జల్లికట్టు క్రీడ కోసమే సాకిన ఎద్దులు యువకులకే కాకుండా ప్రేక్షకులను గడగడలాడించాయి. వీటిలో కొన్ని ఎద్దులు యువకుల నుంచి తప్పించుకుని ప్రేక్షకులను కొమ్ములతో పొడి చాయి.


జల్లికట్టును ప్రారంభిస్తున్న మంత్రి ఉదయనిధి

ఇక కరుప్పన్, కొంబన్, కొడుంబన్, మాయన్, ఎడుప్పన్ అంటూ పేర్లను వింటేనే జడుసుకునేలా ఉన్న ఎద్దులు తమను అణచివేసేందుకు ప్రయత్నించిన యువకులను ముప్పుతిప్పలు పెట్టించాయంటే అతిశయోక్తి కాదు. వాడివాసల్ నుండి రంకెలు వేసుకుంటూ బయటికొచ్చే ఎద్దులు తమ మోపురాలను పట్టుకునేందుకు ప్రయత్నించిన యువకులను కొమ్ములతో పైకి లేపి విసరివేయడం, వేగంగా గుండ్రంగా తిరిగి ఆ యువకుల పట్టు సడలి నేలపై పడేలా చేసి సత్తా చాటాయి. అదే సమయంలో పరుగులు తీస్తున్న ఎద్దుల మోపును బిగబట్టి విడవకుండా చక్కర్లు తిరిగిన యువకుల ధైర్యసాహసాలను చూసి ప్రేక్షకులు ఆశ్చర్యపోయారు. చాలామంది యువకులు వాడివాసల్ వద్దే ఎద్దులను అణచివేయడానికి ప్రయత్నించి నేలపై బోల్తాకొట్టారు. ప్రతి ఎద్దుకు పది నిమిషాలు కేటాయించినా ఒక్కో రౌండ్ ముగియడానికి గంట దాటింది. దీవతో సాయంత్రం 5గంటలకు ముగియాల్సిన జల్లికట్టును 6 గంటల దాకా పొడిగించారు. సాయంత్రం 5.30 గంటలకు తొమ్మిది రౌండ్ల జల్లికట్టు ముగిసింది.

విజేతలకు రెండు కార్లు...

ఈ పోటీల్లో ఎద్దులను అణచి విజేతగా నిలిచే యువకుడికి మంత్రి ఉదయనిధి తరఫున రూ.8లక్షల విలువైన కారు, లక్ష రూపాయల బైకును కానుకగా ప్రకటించారు. ఇదే విధంగా ఈ పోటీల్లో విజేతగా నిలిచే ఎద్దు యజమానికి సీఎం ఎంకే స్టాలిన్ తరఫున రూ.8లక్షల విలువైన కారు, లక్ష రూపాయల బైకును కానుకగా ప్రకటించారు. సాయంత్రం ఐదు గంటలకు తొమ్మిది రౌండ్లు ముగిసినప్పుడు కరుప్పాయూరని ప్రాంతానికి చెందిన యువకుడు కార్తీక్ 18 ఎద్దులను అణచి ప్రథమస్థానం, శివగంగకు చెందిన అభిసిద్ధర్ 17 ఎద్దులను అణచి ద్వితీయ, ఎం కున్నత్తూరుకు చెందిన దివాకర్ 12ఎద్దులను అణచి తృతీయ స్థానంలో నిలిచారు. మధ్యాహ్నం రెండు గంటల సమయంలో ఈ పోటీల్లో పాల్గొన్న 23 మంది యువ వీరులు సహా 51 మంది గాయపడ్డారు. సాయంత్రం 5.30 గంటలకు గాయపడినవారి సంఖ్య 79కి పెరిగింది. వీరిలో 28 మంది యువకులు, 16 మంది ఎద్దుల యజమానులు, 27 మంది ప్రేక్షకులు, ఆరుగురు పోలీసులు ఉన్నారు.

నటుడు సూరికి ఉంగరం కానుక...

ఈ జల్లికట్టులో తమిళ హాస్యనటుడు సూరికి చెందిన ఎద్దు యువకుల అణచివేత నుండి తప్పించుకుని విజేతగా నిలిచింది. దీవతో ఆ ఎద్దు యజమాని సూరికి మంత్రి ఉదయనిధి బంగారు ఉంగరాన్ని కానుకగా అందజేశారు. సూరి ఎద్దు ఇదివరలోనూ పలు జల్లికట్టుల్లో పాల్గొని గెలుపొందింది. అలాగే అమ్మామక్కల్ మున్నేట్ర కళగం నాయకుడు టీటీవీ దినకరన్‌కు చెందిన ఎద్దు, మాజీ మంత్రి విజయభాస్కర్‌కు చెందిన ఎద్దు, యువకుల బారి నుండి తప్పించుకుని, పలువురు యువకులను కొమ్ములతో పొడిచేలా భయపెట్టి పరుగులు తీసి విజేతలుగా నిలిచాయి. కార్యక్రమంలో మంత్రులు అనితా రాధాకృష్ణన్, మూర్తి, చోళవందాన్ శాసనసభ్యుడు వెంకటేశన్ తదితరులు పాల్గొన్నారు.


ఎద్దు పొడవకుండా గుంజ పైకి ఎక్కుతున్న యువకుడు - ఇద్దరి చేతిలో అణగిన ఎద్దు - ఎద్దును అణచేందుకు ప్రయత్నిస్తున్న యువకుడు - పరుగులు తీస్తున్న ఎద్దు మోపురాన్ని పట్టుకున్న యువకుడు - యువకుడిని నేలపై విసిరికొట్టి పొడుస్తున్న ఎద్దు - సాఫీగా వెళుతున్న ఆలయ ఎద్దు

జార్జిటౌన్‌లో ఎంజీఆర్ జయంతి


మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న బాలగంగ, వెట్రిలై మారిముత్తు

ప్యారీస్, జనవరి 17: అన్నాడీఎంకే వ్యవస్థాపకుడు, దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎంజీఆర్ 107వ జయంతిని జార్జిటౌన్ ఆదియప్పన్‌నాయకన్ వీధిలో బుధవారం ఘనంగా నిర్వహించారు. హార్బర్ అన్నాడీఎంకే ప్రాంతీయ కార్యదర్శి వెట్రిలై కె.మారిముత్తు అధ్యక్షతన ఎంజీఆర్ చిత్రపటానికి మాజీ ఎంపీ బాలగంగ తదితర పార్టీ నాయకులు పూలు చల్లి నివాళి అర్పించారు. అనంతరం 1,000 మంది మహిళలకు చీరలు, మరో 5,000 మంది పేదలకు బిర్యానీ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ వేడుకల్లో జిల్లా, ప్రాంతీయ, వార్డుల పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టి.నగర్‌లో ఘనంగా ఎంజీఆర్ జయంతి వేడుకలు

● డాక్టర్ సునీల్ నేతృత్వంలో 1,000 మందికి అన్నదానం

ప్యారీస్, జనవరి 17: అన్నాడీఎంకే వ్యవస్థాపకుడు ఎంజీఆర్ 107వ జయంతి వేడుకలు దక్షిణ చెన్నై ఉత్తర పశ్చిమ జిల్లా అన్నాడీఎంకే ఆధ్వర్యంలో బుధవారం ఉదయం ఘనంగా జరిగాయి. టి.నగర్ నియోజకవర్గం సీబీటీ నగర్ మార్కెట్ జంక్షన్‌లో ఎంజీఆర్ యువజన విభాగం సంయుక్త కార్యదర్శి డాక్టర్ వి.సునీల్ వేదికపై అలంకరించిన పురచ్చి తలైవర్ ఎంజీఆర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం 1,000 మందికి అన్నదానం, మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ వేడుకల్లో 141వ వార్డు అన్నాడీఎంకే కార్యదర్శి ఆర్‌సీఆర్ ప్రభాకరన్, 141వ వార్డు మహిళా విభాగం కార్యదర్శి రేణుక షణ్ముగం, ఉప కార్యదర్శి కె.శాంతి, పళని, ఉప కార్యదర్శి సూర్యకళ, ప్రాంతీయ సంయుక్త కార్యదర్శి తేన్‌మొళి, వార్డు కార్యదర్శులు కరాటే శేఖర్, గార్డన్ సురేష్‌కుమార్, కాలనీ ప్రభాకర్, ఎం.లోకనాథన్, మాంబళం గురుప్రసాద్, ఎస్.సతీష్‌కుమార్, ఆర్.రాజేష్‌కుమార్, సూర్య రమేష్, ముస్తఫా, ఎ.విశ్వనాథన్, కన్నన్, కె.అరుళ్‌దాస్ తదితరులు పాల్గొన్నారు.


అన్నదానం చేస్తున్న డాక్టర్ సునీల్